ప్రజాశక్తి
సోమవారం 25 సెప్టెంబరు 2023
5
శ్రీకాకుళం



ఆకట్టుకున్న బాలు స్వరనీరాజనం



ప్రశంసా పత్రాలను స్వీకరిస్తున్న కళాకారులు

శ్రీకాకుళం అర్బన్ : భారతీయ చలన చిత్రరంగంలో అనేక బాషల్లో స్వరపరచిన కీర్తిశేషులు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయులని పలువురు కొనియాడారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో చేయూత సంస్థ ఆధ్వర్యాన బాలు స్వర నీరాజనం పేరిట ఆయన పాడిన పాటలను పలువురు కళాకారులు ఆదివారం పాడి వినిపించారు. మధుకుమార్ ఆధ్వర్యాన వివిధ చిత్రగీతాలను ఆలపించి శ్రోతలకు వీనుల విందు చేశారు. అనంతరం జమ్మలక్ష్మి బెల్లాన కళ్యాణ్, బరాటం సంగీత, కొట్నీ లింగరాజు, కొండ బాబు, పూర్ణలను సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఆర్‌బికెల్లో వేధిస్తున్న యూరియా

- ప్రయివేటు దుకాణాల్లో నిల్వలు
- అధిక ధరలకు విక్రయాలు
- ఆందోళనలో రైతన్న
- పట్టని వ్యవసాయశాఖ అధికారులు



ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం రైతన్నలకు అండగా నిలిచింది... విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా రైతులకు అందిస్తున్నాం... విత్తనాలు, ఎరువుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నాం... పంటల కోసం సున్నా వడ్డీ, రైతు భరోసా ఇచ్చి రైతన్నలకు ఆదుకుంటున్నాం.... ఈ మాటలు ముఖ్యమంత్రి నుంచి రాష్ట్ర మంత్రుల వరకూ ప్రతి సమావేశంలోనూ చెప్పినవే... కానీ, క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదన్న విమర్శలు రైతన్నల నుంచి జోరుగా వినిపిస్తున్నాయి. యూరియా కోసం 15 రోజులుగా రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం అరకొరగా యూరియా సరఫరా చేసి చేతులు దులుపుకుంది. దీంతో ఒడిశా, ప్రయివేటు ఎరువుల దుకాణాల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేసి పంటలకు యూరియా వేసే పరిస్థితి నెలకొంది.

ఖరీఫ్ ప్రారంభం నుంచీ...

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి రైతన్నలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకవైపు వంశధార అందక మరోవైపు సకాలంలో వర్షాలు కురవక రైతులు అష్టకష్టాలు పడి కొంత మంది ఎదలు, మరికొంత మంది ఊబాలు వేశారు. అయితే ఖరీఫ్ ప్రారంభంలో డిఎపి, యూరియా వేశారు. పంట ఎదుగుతున్న సమయంలో యూరియా, పంట దిగుబడి వస్తున్న సమయంలో పొటాషియం, యూరియా కలిపి వరి పంటకు పిచికారీ చేస్తుంటారు. ప్రస్తుతం పంట ఎదుగుతున్న తరుణంలో యూరియా వేయాల్సి ఉండగా పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూరియా సరఫరా చేయాలని పదేపదే వ్యవసాయశాఖ అధికారులకు అడుగుతున్నా ఫలితం లేకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు నియోజకవర్గంలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండడం లేదు. రైతులకు యూరియా పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని వ్యవసాయశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా ఆ స్థాయిలో మండలానికి అవసరమైన యూరియా సరఫరా చేయడంలో విఫలమవుతున్నారు. మరోవైపు పలాస మండలంలో సుమారు 160, మందస మండలంలో సుమారు 260 మెట్రిక్ టన్నులు ప్రయివేటు దుకాణాల్లో నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి యూరియా బస్తా రూ. 266.60 లుకు విక్రయించాల్సి ఉండగా, ప్రయివేటు దుకాణాల్లో బస్తా రూ. 400 నుంచి 450 వరకు విక్రయిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచాల్సింది పోయి ప్రయివేట్ దుకాణాలకు బస్తాలు సరఫరా చేయడంపై రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేట్ దుకాణాలకు సరఫరా చేస్తున్న యూరియాను రైతు భరోసా కేంద్రాలకు ఎందుకు సరఫరా చేయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులు చొరవ చూపి యూరియా బస్తాలను అందుబాటులో ఉంచి రైతులకు రైతు భరోసా కేంద్రం ద్వారా పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

త్వరలో పంపిణీ చేస్తాం

ఇప్పటివరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియా సరఫరా చేశాం. ఇటీవలకాలంలో జిల్లాకు యూరియా రావడంలో జాప్యం జరగడంతో పంపిణీ చేయలేకపోయాం. ప్రస్తుతం పలాస మండలం గంగువాడ, పెదంచల ఆర్‌బికెలకు యూరియా పంపిణీ చేశారు. యూరియా వచ్చిన వెంటనే ఆర్‌బికెల ద్వారా పంపిణీ చేశారు.

- ఎల్.వి.మధు, వ్యవసాయ శాఖ ఎడిఎ, పలాస

అదిగో... ఇదిగో..

పలాస నియోజకవర్గంలో పలాస మండలంలో 9,437 ఎకరాలు వరి, 3,200 ఎకరాలు ఉద్యానవన పంటలు, వజ్రపుకొత్తూరు మండలంలో 5,995 ఎకరాలు వరి, 11424 ఎకరాల్లో ఉద్యానవన పంటలు, మందస మండలంలో 15,500 ఎకరాల్లో వరి, 12 వేలు ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. అయితే ఆయా మండలాల్లో సుమారు 2,820 మెట్రిక్ టన్నులు యూరియా అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు ఇండెంట్ పెట్టారు. కానీ, పలాస మండలంలో 860 మెట్రిక్ టన్నుల గానూ 383 మెట్రిక్ టన్నులు, వజ్రపుకొత్తూరు మండలంలో 760 మెట్రిక్ టన్నుల గానూ 480 మెట్రిక్ టన్నులు, మందస మండలంలో 1200 మెట్రిక్ టన్నుల గానూ 560 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే 50 శాతం మాత్రమే రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియా సరఫరా చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూరియా అవసరమని రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి అడుగుతున్నా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప సరఫరా చేయకపోవడంతో రైతులు ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పంట ఎదుగుదలకు యూరియా అవసరం. యూరియా అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రైతు భరోసా కేంద్రాల్లో యూరియా నిల్వ లేకపోవడంతో ప్రయివేటు దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నాం. వ్యవసాయ అధికారులు చొరవ చూపి యూరియా అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలి.

- ఆళ్ల వెంకటరావు, రైతు, బ్రాహ్మణతర్ల, పలాస మండలం

అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నాం



ఆర్‌బికెల్లో యూరియా అందుబాటులో లేకపోవడంతో ప్రయివేటు దుకాణాల్లో అధిక ధరలకు యూరియా కొనుగోలు చేస్తున్నాం. కొంతమంది వ్యాపారులు యూరియా నిల్వ చేసి లేదని చెబుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో సమీపంలో ఉన్న ఒడిశా రాష్ట్రం నుంచి యూరియా తెప్పించుకొని పంటకు వేస్తున్నాం. ప్రభుత్వం సకాలంలో యూరియా సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- శిష్ట మురళీకృష్ణ, రైతు, లక్ష్మీపురం, పలాస మండలం



అంగన్వాడీ కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

'చలో విజయవాడ' భగ్నం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

చలో విజయవాడ వెళ్తున్న అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో అంగన్వాడీ కార్యకర్తలు, పోలీసులు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆదివారం మధ్యాహ్నం చలో విజయవాడకు వెళ్లేందుకు పయనమవుతున్న అంగన్వాడీ కార్యకర్తలను రైల్వేస్టేషన్ వద్ద అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నం చేశారు. దీంతో అంగన్వాడీ కార్యకర్తలు పోలీసులు తీరును తప్పుపట్టారు. రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ కూడలి వరకు వందలామంది అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలి వద్ద మానవహారం నిర్వహించి ధర్నా చేపట్టారు. దీంతో పోలీసులు బలవంతంగా వారందరినీ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నం చేయడంతో ఇరు గ్రూపుల మధ్య తోపులాట జరిగింది. టౌన్ ఎస్ఐ గోవిందరావు, రూరల్ ఎస్ఐ రమేష్ ఇతర పోలీస్ సిబ్బంది భారీగా తరలివచ్చారు.

పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన

చలో విజయవాడ వెళ్తున్న అంగన్వాడీ కార్యకర్తలు అకారణంగా పోలీసులు అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సాయంత్రం వరకు నిర్బంధించారు. సాయంత్రం 6 గంటల సమయం వరకూ విడిచిపెట్టకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ... ఆందోళనకు దిగారు. నాలుగేళ్లుగా తమ సమస్యలు వినడానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ముందుకు రాలేదని, కనీసం తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చలో విజయవాడ వెళ్తే అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. దీంతో పోలీస్ స్టేషన్ వద్ద పరిస్థితి ఉద్రిక్తత నెలకొంది. చీకటి పడుతుందని, ఈ సమయంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అంగన్వాడీ కార్యకర్తలు ఎలా తమ గ్రామాలకు వెళ్తారని నిలదీస్తున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు కాళ్ల జయదేవ్, జగదీష్, సంతోష్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని అంగన్వాడీలకు సంఘీభావం తెలిపారు.



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కార్యదర్శికి ముందస్తు నోటీసు



నోటీసు అందజేస్తున్న పోలీసు

ఆమదాలవలస : మండలంలోని దూసి అంగన్వాడీ కార్యకర్త, జిల్లా సహాయక కార్యదర్శి పంచాది లతాదేవికి ముందస్తు నోటీసులు జారీ చేసి హౌస్ అరెస్టు చేశారు. ఈ నెల 25న చలో విజయవాడ పిలుపునివ్వడంతో పోలీసులు ఆమెకు ముందస్తు నోటీసు అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తలెవరూ చలో విజయవాడ వెళ్లడానికి అనుమతులు లేవని తెలుపుతూ నోటీసులు అందజేశారు.

అరెస్టులు అప్రజాస్వామికం

తమ సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ వెళ్తున్న అంగన్వాడీ కార్యకర్తలు అరెస్టులు అప్రస్వామికమని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు తీవ్రంగా ఖండించారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వం అరెస్టులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు.

అంగన్వాడీల నిర్బంధాన్ని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.తేజేశ్వరరావు, సిహెచ్.అమ్మన్నాయుడు ఒక ప్రకటనలో ఖండించారు.



అధికారులతో సమీక్షిస్తున్న డిఆర్ఒ గణపతిరావు

సమర్ధవంతంగా ఎపిపిఎస్‌సి పరీక్షలు

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో సోమవారం నుంచి జరపతలపెట్టిన ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో ఆదివారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి అక్టోబరు 6 వరకు 11 రకాల పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లా ప్రొబేషన్ అధికారి, టెక్నికల్ అసిస్టెంట్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్‌ఆఫ్ ఫిషరీస్, జూనియర్ ట్రాన్సలేటర్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, నాన్ గజిటెడ్, గ్రూప్ 4 వంటి పరీక్షలున్నట్లు పేర్కొన్నారు. ఇవి పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ పరీక్షలని అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర, శ్రీశివాని ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు రెండు షిఫ్ట్‌ల్లో పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి గంట ముందే హాజరుకావాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అలసత్వం, అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తేల్చిచెప్పారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్, తాగునీరు, విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల కొరకు ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు నడపాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. అధికారులకు అప్పగించిన విధులను సమన్వయంతో సక్రమంగా నిర్వహించాలన్నారు. పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ బి.సిహెచ్.కుమార్‌రాజు, సెక్షన్ ఆఫీసర్ డి.ప్రశాంత్‌కుమార్, అడిషనల్ ఎస్‌పి జె.తిప్పేస్వామి, ఎచెర్ల తహశీల్దార్ సత్యనారాయణ, హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు శ్రీకాంత్, డిటిలు ఆర్.శ్రీనివాసరావు, త్రినాథరావు, వెంకటేశ్వర, శివానీ ఇంజినీరింగ్ కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంకిత భావంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

స్ఫూర్తి, అంకితభావంతో ముందుకు సాగాలని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఛాన్సలర్ ఆచార్య కె.సి.రెడ్డి అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీకాకుళం ట్రిబుల్ ఐటిని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాకల్టీ ఓరియంట్ ప్రోగ్రాంలో గెస్ట్ ఫ్యాకల్టీకి దిశానిర్దేశం చేశారు. ఫ్యాకల్టీలో మంచి అవగాహన కల్పించి విద్యార్థులకు మంచి బోధన చెప్పి ఉత్తమ ఫ్యాకల్టీగా గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఓఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి మోహన్‌కృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఆంధ్రా యూనివర్సిటీ ఎక్స డైరెక్టర్ డి.హరినారాయణ, ప్రొఫెసర్ సిహెచ్.వి.వి.ఎస్.భాస్కర్‌రెడ్డి, కృష్ణ యూనివర్సిటీ ఎక్స వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్,రామకృష్ణరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.సి.రెడ్డి

'కొరటాల' ఆశయ సాధనకు కృషి



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజా ఉద్యమాల్లో కొరటాల సత్యనారాయణ ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉందని, ఆయన ఆశయ సాధనకు మరింత కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తిలు పిలుపునిచ్చారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జాతీయ నాయుకులు కొరటాల సత్యనారాయణ శత జయంతి సభ ఆదివారం నిర్వహించారు. సభలో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ సత్యనారాయణ నిరంతరం కార్మిక, రైతాంగ, ప్రజా సమస్యలు పరిష్కారానికి అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. అణగారిన వర్గ ప్రయోజనం కోసం నిరంతరం కృషి చేసిన ఆయన చట్టసభల్లో సైతం వారి గొంతు కోసం ప్రశ్నించారన్నారు. రైతాంగ పోరాటంలో జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో ఉవ్వెత్తున సాగిన ప్రజా ఉద్యమంలో పాల్గొన్న ఆయన ఉద్యమానికి మద్దతుగా శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారన్నారు. నాడు రాజీనామాలు చేసిన శాసనసభ్యుల్లో తానూ ఒకరని గుర్తు చేశారు. మరో వైపు శ్రామిక సమస్యలు పరిష్కారానికి సంఘాలు నిర్మించి అనేక ప్రయోజనాలు సాదించడానికి కృషి చేశారు. పేద రైతులు, కౌలు రైతుల ప్రయోజనాల కోసం, వృత్తిదారుల సంరక్షణకు చట్టబద్ధతను సాధించేందుకు ఎంతగానో కృషి చేశారని అన్నారు. తుది శ్వాస విడిచే వరకు మార్క్సిస్టు సిద్ధాంతంపై అత్యంత విశ్వాసంతో కమ్యూనిస్టుగా పనిచేశారన్నారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమానికి పోలాకి ప్రసాదరావు అధ్యక్షత వహించగా పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో ఎ.సోమశేఖర్, అల్లు సత్యనారాయణ, పి.గోపి, ఎం.సురేష్, కె.సూరయ్య పాల్గొన్నారు.

కొరటాల జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి సాహితీ సంస్థను మరింత అభివృద్ధిలోకి తీసుకెళ్లడమే కొరటాల సత్యనారాయణకు మనమిచ్చే ఘన నివాళి అని ప్రజాశక్తి ఎడిషన్ మేనేజరు పి.కామినాయుడు పేర్కొన్నారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురం పంచాయతీ నవభారత్ కూడలి ఇండస్ట్రీరియల్ ఏరియాలోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో కొరటాల శతజయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కొరటాల చిత్రపటానికి కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఉన్నత కుటుంబంలో పుట్టిన ఆయన పేదల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేశారన్నారు. చేనేత కార్మికుల ప్రయోజనాల్ని కాపాడేందుకు ఆయన నేతృత్వాన అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి వివిధ ఉద్యమాల్లో పాల్గొన్న ఆయన సిపిఎంలో క్రియాశీలక కార్యకర్తగా మొదలై పోలిట్‌బ్యూరో సభ్యుని స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. బుచ్చిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎ.సోమశేఖర్, ప్రకాష్, మధు, కిరణ్‌కుమార్, చింతాడ కృష్ణారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

సమాజ సేవలో యువత భాగస్వామ్యం

ట్రిబుల్ ఐటి డైరెక్టర్ జగదీశ్వరరావు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

యువతను సమాజ సేవలో చైతన్య పరచిన జాతీయ సేవా పథకం అని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ శ్రీకాకుళం ప్రాంగణంలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గాంధీ మహాత్ముని శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 50 సంవత్సరాల కిందట మన దేశంలో ప్రారంభమైన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యువతను సమాజ సేవలో చైతన్య పరచటంలో ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ఓఎస్‌డి ప్రొఫెసర్ ఎల్.డి.సుధాకర్‌బాబు మాట్లాడుతూ వాలంటీర్లు ఎన్ఎస్ఎస్ అడాప్ట్ చేసుకున్న ప్రజల్లో ఆరోగ్యం- పరిశుభ్రత, స్వచ్ఛత తదితర అంశాలపై పాఠశాల పిల్లలకూ అవగాహన కల్పించాలన్నారు. పరిపాలన అధికారి ముని రామకృష్ణ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని, విద్యార్థి దశలోనే అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.ముకుందరావు, పిఆలు డాక్టర్ వి.సింహాచలం, డాక్టర్ బి.శ్రీధర్, డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, డాక్టర్ జి.ఈశ్వరరావు, ఆర్.మల్లీశ్వరి పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జగదీశ్వరరావు

రక్తహీనత లేని సమాజం అవసరం

- పౌష్టికాహారం సక్రమంగా అందించడమే లక్ష్యం
- అంగన్వాడీ కేంద్రాలపై ప్రత్యక్ష పర్యవేక్షణ
- ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతిశ్రీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలపై ప్రత్యక్ష పర్యవేక్షణ మంచి ఫలితాలు ఇస్తోందని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి బగాది శాంతిశ్రీ అన్నారు. ప్రధానంగా మహిళల అభివృద్ధికి పూర్తి తోడ్పాటు అందించాలంటే ఆరోగ్య వంతమైన జీవనం అవసరం అన్నారు. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా ప్రజలకు అందించడమే సమగ్ర మహిళాభివృద్ధి శాఖ లక్ష్యమని తెలిపారు. అక్రమాలకు తావు లేకుండా ప్రతి కార్యకర్తా కేంద్రల ద్వారా అందించాల్సిన సేవలను క్రమం తప్పకుండా ఉండేదందుకు కృషి చేస్తున్నాట్టు చెప్పారు. ఎక్కడైనా లోపాలు ఉన్నట్టయితే వాటిని సరిదిద్దడానికి అధ్యయనం చేస్తున్నామని వివరించారు. ప్రధానంగా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు కార్యకర్తలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఆ దిశగా శాఖా పరమైన చర్యలు ప్రారంభించినట్టు చెప్పారు. జిల్లాలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆమె క్షేత్ర స్థాయిలో పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు 'ప్రజాశక్తి' వివరించారు.

? జిల్లాలో ఐసిడిఎస్ ద్వారా ఎంత మంది లబ్ధి పొందుతున్నారు?


జిల్లాలో సమగ్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ పరిధిలో 16 ప్రాజెక్టుల ద్వారా సేవలు అందిస్తున్నాం. వాటి పరిధిలో 3,358 కేంద్రాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 11,480 మంది గర్భిణులకు, 11,952 మంది బాలింతలకు, 79,871 మంది చిన్నారులకు ఈ కేంద్రాల ద్వారా సేవలు అందుతున్నాయి. వారి సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అందిస్తున్నాం. పాలనా పరమైన సంస్కరణలు తప్ప పథకం అమలులో ఎలాంటి మార్పులు లేవు. మహిళల ఆరోగ్యంపైనే ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాం.

? ఆరోగ్యంగా వారుండేందుకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

జిల్లాలో సుమారు లక్ష మందికి పైగా తల్లులకు, పిల్లలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. తల్లులు, పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించడంలో ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా పథకాల అమలుపై శ్రద్ధ చూపుతున్నాం. మాతా శిశు మరణాలతో పాటు తల్లీబిడ్డల మరణాల రేటు తగ్గడమే ప్రధాన లక్ష్యం. చిన్నారుల పెరుగుదల పర్యవేక్షణ (గ్రోత్ మానిటరింగ్) చేస్తున్నాం. క్షేత్ర స్థాయి తనిఖీలు పెంచడం జరిగింది. మారుమూల ప్రాంతాల్లోని కేంద్రాలపై మరింత నిశిత పరిశీలన చేపట్టనున్నాం.



బి.శాంతిశ్రీ, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్



? గర్భిణులకు, చిన్నారులకు రోగనిరోధక శక్తిని పెంచడానికి వ్యాక్సినేషన్ ఎలా సాగుతోంది?

జిల్లాలో గర్భిణులకు, చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ ప్రక్రియ జరుగుతోంది. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వెల్‌నెస్ సెంటర్లలో ఈ వ్యాక్సినేషన్ జరుగుతోంది. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీలు సమన్వయంతో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. అలాగే వ్యాక్సినేషన్ ప్రక్రియ వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ శాఖల మధ్య నివేదికల్లో తేడాలు రాకుండా సమన్వయంతో పనిచేయాలి. వ్యాక్సినేషన్‌పై దృష్టి సారించి శతశాతం వ్యాక్సినేషన్ పూర్తి చేయాలి. ప్రతినెలా మాసాంతానికి ఈ నివేదికలు పంపించాల్సి ఉంటుంది. దీనికి తోడు ప్రభుత్వం రూపొందించిన యాప్‌ల్లో ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలి. అలసత్వం ఉన్న వారిపై చర్యలు తప్పవు.

? సరకుల సరఫరాలో అక్రమాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ప్రతినెలా 5లోగా అంగన్వాడీ కేంద్రాలకు సరుకులు పంపిణీ జరుగుతోంది. కొన్నిసార్లు జాప్యం జరిగినా తదనంతరం సరఫరా చేపడుతున్నారు. పాలు, గుడ్లు సరఫరాలో ఎక్కడా లోపాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. దీనికి తోడు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. లబ్ధిదారులకు నేరుగా పోషకాహారం అందించడం జరుగుతోంది. ఏ ఒక్క లబ్ధిదారులకూ సరకులు అందలేదన్న ఫిర్యాదులు రాకుండా పేస్‌యాప్, థంబ్ వంటి జాగ్రత్తలు తీసుకుంటున్నాం. క్రమం తప్పకుండా కార్యకర్తలు, సిబ్బంది నుంచి కేంద్రాల్లో ముఖ హాజరు తీసుకుంటున్నాం.


క్రీడాకారులను అభినందిస్తున్న సూరశ్రీనివాసరావు

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

సూర శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలవాలని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శిపివిజి కష్ణంరాజు(మురళీ మాస్టారు) క్రీడాకారులకు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకాకుళం బాల్ బ్యాడ్మింటన్ మైదానంలో ఆదివారం సబ్ జూనియర్ బాల, బాలికల శిక్షణ శిబిరంను ఎచ్చర్ల బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్షుడు సూర శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడగా ప్రఖ్యాతగాంచిన బాల్ బ్యాడ్మింటన్ లో రాణిస్తున్న క్రీడాకారులందరూ నిరుపేదలే ఉన్నారని, ఇప్పటివరకు అసోసియేషన్ ప్రతినిధులు అండగా ఉన్నారన్నారు. ప్రభుత్వం రైల్వే రాయితీలను నిలుపుదల చేయడంతో క్రీడాకారులపై మరింత ఆర్థిక భారంగా మారుతోందని, ఈనెల 30, అక్టోబరు 1, 2వ తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి పాల్గొననున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి బి. హెచ్ అరుణకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి పి. అజయ్ కుమార్, ఎల్.వి. రమణ, శిక్షకులు పి రాజ్ కుమార్, ఎం.మధుసూధనరావు, పి.పవన్ కుమార్, చిరంజీవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే..

బాలుర విభాగంలో..

శిష్టు హిమత్ కుమార్, నర్సీపురం ప్రవీణ్ కుమార్, లబ్బ మణికంఠ, గొంటి నవీన్ కుమార్, గూడిపూడి చాయాకిరణ్, వాకమారి యోగి, వెంపాడ సురేష్‌రెడ్డి, పొన్నాడ జితేంద్ర, ఎర్ర మదన్, పట్టీసపు నిష్కాంత్‌ఉన్నారు.

బాలికల విభాగంలో..

ముంత గాయత్రి, సింగూరు నందిని, బెండు జోత్స్న, సంబంగి వినూత్న, శిష్టు ప్రియమణి, రామ భువనేశ్వరి, ఉంగటి పావని, చల్ల శ్రావణి, పోరాం భువనకతి ఉన్నారు.



విజేతలకు మెడల్, గుర్తింపు పత్రం అందిస్తున్న స్కూల్ చైర్మన్ ఎన్ఇఆర్

చదరంగంతో ఏకాగ్రత

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

చదరంగం ఆడటం వలన ఏకాగ్రత మెరుగు పడుతుందని ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఇఆర్) అన్నారు. మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెంలో ఉన్న ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ర్యాంకింగ్ స్కూల్ చెస్ టోర్నమెంట్‌కు రాష్ట్రంలో 17 జిల్లాలనుంచి 60 స్కూల్స్ చెందిన 250 మంది క్రీడాకారులు వచ్చారు. ఇందులో ఇంటర్నేషనల్ రేటెడ్ క్రీడాకారులు, స్టేట్ లెవెల్ క్రీడాకారులతో పాటు వర్ధమాన క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ కేటగిరీల్లో ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయి పాఠశాలల చదరంగం పోటీలకు ఎంపికయ్యారు. చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ పిల్లల జీవితంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయని, తద్వారా విద్యార్థిలో ఏకాగ్రత, ఏకాగ్రత మెరుగ్గా ఉండేలా సహనం, ప్రణాళికాబద్ధత, బావి థ్రిల్‌ను నేర్పుతుందన్నారు. డైరెక్టర్ ఎన్.తేజబాబు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ కేవలం గెలుపు ఓటమి మాత్రమే కాదని ఇది మీ సరిహద్దులను నెట్టడం, మీ యొక్క ఉత్తమ సంస్కరణగా మారడం, 64 చతురస్రాల ఈ యుద్ధభూమిలో ప్రతి కదలిక విజయానికి ఒక సోపానమే కాదు, అది జీవితానికి ప్రతిబింబమని గుర్తుంచుకోవాలని అన్నారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెవివి శర్మ, రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు మాట్లాడుతూ ఇంతమందికి ఆతిథ్యమివ్వడం గర్వకారణమని, టోర్నమెంట్‌ను నిర్వహించడంతో పాటు ప్రతి తల్లిదండ్రులను ఆదుకుంటున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ సుధీర్ కుమార్, చెస్ అసోసియేషన్ కోశాధికారి జ్వాలాముఖి, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు బగాది కిషోర్, కార్యదర్శి జామి రమేష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉదయ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

ఆర్మీ క్యాంటీన్ల పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంతో పాటు పలాసలో నిర్వహిస్తున్న ఆర్మీ క్యాంటీన్లను ఆర్మీ మేజర్ జనరల్ రాకేష్ మనోచ సతీసమేతంగా ఆదివారం సందర్శించారు. ఆయనతో పాటు కల్నల్ వి. జయన్, విశాఖపట్నం స్టేషన్ హెడ్ క్వార్టర్స్ కల్నల్ పాండే హాజరయ్యారు. క్యాంటిన్లను పరిశీలించిన అనంతరం మాజీ సైనికులు, వీర నారీ మణుల సంక్షేమంతో పాటు ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ కారణాల వల్ల మృతి చెందిన సైనికుల కుటుంబాలకు ప్యామిలీ వెల్ఫేర్ నుంచి రూ.15వేలు వంతున చైర్మన్‌గా వ్యవహరిస్తున్న పూజ మనోచ చేతులమీదుగా అందజేశారు. మాజీ సైనికుల ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎ. శైలజ, జిల్లా ఇసిఎచ్ఎస్ పోలిక్లినిక్ అధికారి విశ్రాంత కల్నల్ ఎం. నారాయణరావు, జిల్లా మాజీ సైనికుల సమాఖ్య చైర్మన్ కెప్టన్ పి. ఈశ్వరరావు, జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షులు పూర్ణ చంద్రరావు కటకం, జిల్లా యూనిట్ రన్ క్యాంటీన్ మేనేజర్ టి. కష్ణారావు, జిల్లా మాజీ సైనికుల సమాఖ్య హానరరీ చైర్మన్ ఎస్.ఎస్.ఎల్.మూర్తి పాల్గొన్నారు.


రగ్బీకి ఎంపికైన క్రీడాకారులు

రగ్బీ జిల్లా జట్టు ఎంపిక

టెక్కలి : అండర్ 18 జూనియర్ బాలబాలికల రగ్బీ జిల్లా జట్టు ఎంపిక స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జరిగింది. ఎంపిక సందర్భంగా నిర్వహించిన పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ప్రారంభించారు. 24 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని జిల్లా అసోసియేషన్ ఆధ్యక్షులు వారణాసి గోవింద్ తెలిపారు. జిల్లా జట్టు అక్టోబర్ 1, 2 తేదీల్లో కర్నూల్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నారు. ఎంపికైన జట్టుని కళాశాల ప్రిన్సిపాల్ గోవిందమ్మతో పాటు అసోసియేషన్ ఆధ్యక్ష, కార్యదర్శులు వారణాసి గోవింద్‌తో, పోన్నాడ పార్వతీశం, డొంకాన రామకృష్ణలు అభినందించారు. ఎంపికల్లో కన్వీనర్ నారాయణరావు, రఘునాథరావు, లక్ష్మణరాజా, రామిరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమాతో ప్రజలకు మేలు

వజ్రపుకొత్తూరు: వైఎస్సార్ బీమాతో పేద ప్రజలకు మేలు జరుగుతుందని అమలపాడు సర్పంచ్ దున్న రత్నం బాలరాజు అన్నారు. అమలపాడు పంచాయతీ చిన్నబచ్చులవాని పేటకు చెందిన బచ్చులు విశ్వనాథం శనివారం అనారోగ్యంతో మతి చెందాడు. మతుని కుటుంబానికి ఆదివారం వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ. పదివేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి గ్రామ అధ్యక్షులు పోతనపల్లి లింగరాజు, ఉప సర్పంచ్ కారడ గిరిబాబు పాల్గొన్నారు.

వంతెన అలా ... రహదారులు ఇలా

- దశాబ్దాలు గడుస్తున్నా మారని దుస్థితి
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు


అధ్వానంగా ఉన్న గొడ్డ -ఆంపురం రోడ్డు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టి మండలంలో వంతెన సమస్యతోపాటు అధ్వాన రహదారులు ఈ ప్రాంత ప్రజలను వెంటాడుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా గ్రామాల్లో మౌలిక సమస్యలు తీరడం లేదని పలువురు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీటీ రోడ్లు మరమ్మతులకు గురై రహదారులపై ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. నేలబొంతు నుంచి వీరన్న పేట, గొట్టిపల్లి మధ్య తారు రోడ్డుపై రాళ్లు తేలి దయనీయంగా తయారయ్యాయి. అభివద్ధి లేక రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలతో నిండి కాలిబాటగా తయారైంది. భరణికోట కాలనీ నుంచి మర వరకు రోడ్డులో రాళ్లు తేలాయి. సరిహద్దు ఒడిశా నుంచి రంపకాన వరకు ఉన్న రోడ్డులో గుంతలు కప్పినా యధాస్థితిగా మారాయి. ఆల్ ఆంధ్ర రోడ్‌లోని మెళియాపుట్టి -పాతపట్నం మధ్య ఎక్కడపడితే అక్కడే గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల ప్రాంతాలైన గొడ్డ నుంచి ఆంపురం, ఆల్ ఆంధ్ర రోడ్డు నుంచి దారిపేట రహదారి పెద్ద పద్మాపురం నుంచి దుర్బలాపురం, పలాస రోడ్డు నుంచి పదనాపురం వెళ్లే రహదారులు మరింత అధ్వానంగా ఉన్నాయి. దబ్బగూడ, గేటుపేటకు వెళ్లే రహదార్ల దుస్థితి అదే. అధికారులు, ప్రజాప్రతినిధులు రహదారుల అభివద్ధిపై దష్టి సారించడం లేదని ఆ ప్రాంతపు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బి రహదారిలో రోడ్డు కల్వర్టులు శిథిలావస్థకు గురవుతున్నాయి. వసుంధర, చాపర జీడి పరిశ్రమ, పట్టుపురం వద్ద రోడ్డు కల్వర్టులకు రంధ్రాలు ఏర్పడ్డాయి. ఈ రహదారుల్లో భారీ గ్రానైట్ లారీలు రాకపోకలతో రహదారులు ఎక్కడికక్కడ పాడవుతున్నాయి.

తీరని వంతెన సమస్య

మండలంలో చివరి గ్రామమైన గోకర్ణపురం గ్రామానికి వంతెన సమస్య ఊరిస్తూనే ఉంది.. గ్రామానికి అనుసరించే వరహాల గెడ్డ ఉండడంతో కొద్దిపాటి వర్షం పడినా నీరు పొంగి ప్రవహించి గ్రామానికి రాకపోకలు స్తంభించే పరిస్థితి ఎదురవుతోంది. వంతెన నిర్మాణం కాకపోవడంతో గ్రామస్తులకు శాపంగా మారింది. గ్రామానికి వచ్చే అధికారులు ప్రజా ప్రతినిధులకు తమ గోడును వెళ్ళబోసుకుంటున్నా ఫలితం కనిపించడం లేదు.

మరీ ఇంత చిన్నచూపా

గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పట్ల చిన్నచూపు కనిపిస్తోంది. ఏళ్లు గడుస్తున్నా అభివద్ధికి దూరంగానే ఉన్నాయి. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందన అంతంత మాత్రమే

- ఎస్.ఆదినాయుడు, వైస్ ఎంపీపీ మెళియాపుట్టి

అవస్థలు పడుతున్నాం

గ్రామానికి వంతెన సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడుతున్నాం. వంతెన సమస్య తీరకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో చిన్నారులు, వద్ధులు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వంతెన సమస్య గ్రామానికి శాపంగా మారింది.

- సేనాపతి రవికుమార్, గోకర్ణపురం సర్పంచ్

మైనర్లు వాహనం తెస్తే మరమ్మతులు చేయొద్దు


మాట్లాడుతున్న సిఐ వేణుగోపాలరావు

ప్రజాశక్తి- కొత్తూరు

మైనర్ బాలురు ద్విచక్ర వాహనాలు తెస్తే మెకానిక్‌లు మర్మతులు చేయరాదని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్.వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం స్థానిక గోగుల రామారావు నాయుడు కల్యాణ మండపంలో విజయ దుర్గ మెకానికల్ వెల్ఫేర్ అసోసియేషన్ 12వ వార్షికోత్సవంలో టూవీలర్ మెకానికల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. జ్యోతి వెలిగించి టూవీలర్ రూప కర్త గట్లబ్ డై మెలిర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహన ప్రమాదాల్లో అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయని, దీనిని దష్టిలో పెట్టుకొని వాహనదారులు మరమ్మత్తులకు వచ్చేటప్పుడు మెకానిక్‌లు లైసెన్సు, ఇన్సూరెన్స్, వాహనానికి సంభంధించిన ధ్రువపత్రాలు ఉన్నాయా అని ఆరా తీయలన్నారు. చోరీ గురైన వాహనాలు అని అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. హెల్మెట్‌ను ధరించాలని అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు వెలుగు అసోసియేషన్ కార్యదర్శి బి.సంజీవరావు మాట్లాడుతూ సంఘంలో ఆదాయం, వ్యయం రాత పూర్వకంగా ఉండాలన్నారు. జిల్లాలో ఉన్న సంఘాలను బలోపేతం కావాలని, జిల్లాస్థాయిలో సంఘంగా ఏర్పడలన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, బుద్దల శ్రీను, జె.అప్పలనాయుడు, జీవా, కష్ణారావు, కె.మిన్నరావు పాల్గొన్నారు.

ఒపిఎస్‌నే అమలు చేయాలి

పెన్షనర్ల సంఘం డిమాండ్


మాట్లాడుతున్న జనార్ధనరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిపిఎస్ వద్దే వద్దని ఒపిఎస్ ముద్దు అని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం పట్టణంలోని లక్ష్మీ నగర్ వీధిలో సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సురవరపు సిమ్మి నాయుడు బొడ్డేపల్లి జనార్ధన రావు ఆధ్వర్యంలో సంఘ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్లకు పాత పెన్షన్ విధానం మాత్రమే కొనసాగించాలని మరే ఇతర సిపిఎస్, జిపిఎస్ వంటి విధానాలు తమకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాలను విస్మరించి నష్టదాయకమైన విధానాలు అమలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహన రావు, కోశాధికారి హెచ్‌వి సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

పలాసలో కేంద్రీయ విద్యాలయం

ప్రజాశక్తి - పలాస

పలాస పట్టణం, పరిసర ప్రాంతంలో సిబిఎస్‌సిలతో కూడుకున్న కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడానికి సన్నహాలు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సబ్ ఏరియా ఆర్మీ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ రాకేష్ మనోజ్ వెల్లడించారు. ఆదివారం పలాస (చినబడం)లో ఆర్మీ క్యాంటీన్ సందర్శించి తనిఖీలు చేపట్టారు. అనంతరం మాజీ సైనికులు, ప్రస్తుత ఉద్యోగులు, వీర మహిళలు, వీర మాతమూర్తులతో సమావేశమయ్యారు. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొంతమంది ఆర్మీ ఉద్యోగులు మాట్లాడుతూ ఆర్మీ కుటుంబాల అవసరార్థం ఆర్మీ క్యాంటీన్ ఏర్పాటు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు, 12 మండలాల పరిధిలో మూడు వేలమంది విశ్రాంత ఆర్మీ కుటుంబాలున్నాయని, పలాసలో ఆర్మీ పిల్లల కోసం కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఆర్మీ ఉన్నత అధికారులతో చర్చలు జరిపి పూర్తి అనుమతులు పొంది ఏర్పాటుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

రానున్న రోజుల్లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు పై స్పష్టత ఇస్తామని, వైద్య సేవలు నిమిత్తం పోలి క్లినిక్ పై చర్చిస్తామని అన్నారు. సికింద్రాబాద్ ఆర్మీ యూనిట్ అధికారులు ఆర్మీ క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలాస మాజీ సైనిక సంక్షేమ సంఘం ఇచ్చిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఇళ్ల మన్మధరావుతోపాటు సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల తీరుపై అసహనం

టెక్కలి : తపట్టణంలోని కాటాబంద వద్ద పట్టణంలోని పలు సంఘాలకు కేటాయించిన స్థలాలు దురాక్రమణ జరగడంపై రెవెన్యు అధికారులు అనుసరిస్తున్న వైఖరిపై సంఘ నిర్వాహకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సర్వే నెంబర్ 468లో పట్టుశాలీ సంక్షేమ సంఘం, సోండి కుల సంక్షేమ సంఘం, బ్రాహ్మణ సంఘం, ముస్లింల షాదీ ఖానాకు భవనాలు నిర్మాణం దృష్ట్యా ఒక్కొక్క సంఘానికి 5 సెంట్లు చోప్పున్న 20 సెంట్లు స్థలాన్ని 2018లో అప్పటి ప్రభుత్వం కేటాయించారు. అయితే సంఘ భవనాలు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని భావిస్తున్న తరుణంలో నిర్మాణాల్లో ఆలస్యం జరిగింది. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో సంఘాలు భవనాలు నిర్మాణాలు చేసుకోలేకపోయాయి. దీంతో సమీపంలోని ఆదిఆంధ్రా వీదికి చెందిన యర్ర బైరాగి అనే వ్యక్తి సదరు సంఘాలకు కేటాయించిన 20 సెంట్లు స్థలంతో పాటు మిగిలిన స్థలాల్ని ఆక్రమిస్తు కంచె వేయడంతో సంఘ నాయకులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించి స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అప్పటి సబ్‌కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఇరుపక్షాల వారితో చర్చలు జరిపారు. ఈ క్రమంలో ఆక్రమి తదారుడు వద్ద ఎటువంటి పత్రాలు లేకపోయినా, సంబంధిత రెవెన్యూ అధికారులు ఆక్రమితదారునికి వత్తాసు పలుకుతూ కంచె తొలగించి సంఘాలకు కేటాయించిన స్థలాలు అప్పజెప్పడంలో కాలయాపన చేయడంలో గల ఆంతర్యం అంతు చిక్కడం లేదు. ఇదే విషయమై టెక్కలి తహశీల్దార్ కురమాన ప్రవల్లికాప్రియని సంఘ నాయకులు ఆడుగ్గా తన పరిధిలో లేదని చెప్పడం గమనార్హమని సంఘ నాయకులు వాపోతున్నారు. స్పందనలో చేసిన ఫిర్యాదు మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో నమోదు ఆయినప్పటికీ సంబంధిత ఆధికారులు సమస్య పరిష్కారం వైపు దృష్టి సారించకండా ఫిర్యాదు చేసిన సంఘ నాయ కులతో మంతనాలు జరిపి ఫిర్యాదు పరిష్కారం అయినట్లు చెప్పాలని చెప్పడం విశేషం. స్థలంపై చర్యలు తీసుకుని సంఘాలకు స్థలం ఆప్పగించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు రెవెన్యూ అధికారులను కోరినప్పటికీ వారు చర్యలు తీసుకో కపోవడం లోని ఔచిత్యమేమిటని సంఘ నాయకులు వాపోతున్నారు.

ఆదిత్య ఆర్చరీ అకాడమీలో ఎంపికలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


రాజ్‌కుమార్

జిల్లా విద్యాశాఖ అధికారి జారీ చేసిన ప్రకటన ప్రకారం ఈనెల 14 నుంచి 20 వరకు అమలు చేయవలసిన క్రీడా క్యాలెండర్ ప్రకారం, క్రీడలో భాగంగా ఎస్‌జిఎఫ్ జిల్లాస్థాయి ఆర్చరీ (విలు విద్య) పోటీల ఎంపిక కార్యక్రమం శ్రీకాకుళంలో అరసవల్లిలోని ఆదిత్య ఆర్చరీ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ చెటికం రాజకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులననుసరించి అండర్-14, అండర్-17 విభాగాలకు సంబంధించిన ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చునని అన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలలోని విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఈ ఎంపిక కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆర్చరీలో వివిధ స్థాయిల్లో పోటీల కోసం అర్హులైన విద్యార్థులు తమను సంప్రదించవచ్చునని అన్నారు. మరిన్ని వివరాలకు 9440395109 సెల్ నంబరును సంప్రదించాలని కోరారు. జిల్లాలోని పాఠశాలల విద్యార్థులు విరివిరిగా ఎంపికలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

జి.సిగడాం: అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ఉక్కు పాదం తప్పదని జి సిగడాం ఎస్సై చామంతుల రామారావు హెచ్చరించారు. మండలంలో సారాయి, గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా, కలిగి ఉన్న వాటిపై గట్టినిఘా ఏర్పాటు చేశామని, అందుకోసం మండలంలో మండల కేంద్రం, పొగిరి, పాలఖండ్యం, వంద్రంగి సెంటర్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పాఠశాలల జోన్లు వద్ద ఆకతాయిలు ద్విచక్ర వాహనాలపై చక్కర్లు కొట్టినా, బాలికలపై ఈవ్ టీజింగ్ చేసినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. రహదారిపై ప్రయాణం చేసే ప్రతి వాహ నదారుడు ప్రమాదాలు నివారించేందుకు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. చట్ట నిబంధన లు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.


ప్రథమ బహుమతి అందజేస్తున్న ఫాల్గుణరావు

తేలి నీలాపురంలో క్విజ్ పోటీలు

టెక్కలి రూరల్ : వినాయక నవరాత్రులు సందర్భంగా నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీలు టెక్కలి మండలం తేలినీలాపురంలో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలకు పది పాఠశాలల నుంచి పది టీమ్ లు హాజరయ్యాయి. పోటీలలో ప్రథమ బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సీతాపురం, ద్వితీయ బహుమతి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల టెక్కలి, తతీయ బహుమతి అరుణ విద్యాలయం టెక్కలి బృందాలు కైవసం చేసుకున్నాయి.. ప్రథమ బహుమతి కింద రూ.5 వేలు నగదు, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు నగదు, తతీయ బహుమతిగా రూ.2 వేలు పారిశ్రామికవేత్త ఫల్గుణరావు అందజేశారు. ఈ పోటీలకు క్విజ్ మాస్టర్స్‌గా భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు బాపూజీ, మరో ఉపాధ్యాయుడు మన్మధరావులు నిర్వహించారు. క్విజ్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా రిటైర్డ్ ఉపాధ్యాయులు పి.సూర్యరావు, రైల్వే ఉద్యోగి బి. తారాపతి వ్యవహరించారు. కార్యక్రమంలో సూర్యారావు, గౌరిప్రసాద్, వెంకటరమణ, తవిటినాయుడు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ హ్యాపీనెస్‌పై అవగాహన

పలాస : పలాస శివాజినగర్‌లో స్వస్తి పిరమిడ్ ధ్యాన్ కేంద్రం వద్ద ఆదివారం ఉదయం ఆర్ట్ అఫ్ లివింగ్ హ్యాపీనెస్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సును విశాఖపట్టణానికి చెందిన తుమరాడ అరుణ కుమారి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీనియర్ ఫ్యాకల్టీ నిర్వహించారు. యోగా, ధ్యానం యొక్క ఉపయోగాలను ఆట పాటలతో ఉల్లాసంగా ఎలా ఉండాలో తెలియజేసారు.

జగనన్న కాలనీపై జగడం

ప్రజాశక్తి- కవిటి

కవిటి మండలం కొత్త కొజ్జిరియా పంచాయతీలో రెండేళ్లుగా నలుగుతున్న జగనన్న కాలనీ పంచాయతీ రసవత్తరంగా మారింది. అధికారులు స్పందించి బుధవారంలోగా తమకు ఇళ్ల స్థలాలు కేటాయించకపోతే దీక్ష చేపడతామని 62 మంది లబ్ధిదారులు అల్టిమేటం జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం ఉదయం జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి స్థానిక సర్పంచ్ ప్రతినిధి పద్మనాభం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మొదటగా 2019లో తమ పంచాయతీ లబ్ధిదారులకు కరాపాడులో స్థలాలు కేటాయించారని, కానీ అక్కడ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో అది నిలిచిపోయిందని తెలిపారు. అనంతరం 2022లో జరిగిన రీ సర్వేలో రఘునాథపురం రెవెన్యూ పరిధిలో 134/15 సర్వే నెంబరులో 1.15 ఎకరాలు, కొజ్జిరియా రెవెన్యూ పరిధిలో 121/1 సర్వే నెంబరులో 50 సెంట్లు ప్రభుత్వ భూమి ఉన్నట్టు రెవెన్యూ అధికారులు గుర్తించి కాలనీకి కేటాయించారని పద్మనాభం తెలిపారు. అయితే కొయ్య అప్పారావు, బొన్న మోహనరావు అనే ఇద్దరు వ్యక్తులు దీనిపై రెవెన్యూ అధికారులను కలిసి ఆ భూమి తమదని ఫిర్యాదు చేశారని, కానీ వారివద్ద ఆ భూమికి సంబందించిన పత్రాలు, తగిన ఆధారాలు లేకపోవడంతో వెనుదిరిగారని గుర్తు చేశారు. కొన్ని నెలల తరువాత వీరు ఆ భూమికి సంబంధించి దొంగ పత్రాలు సష్టించి కోర్టులో కేసు వేశారని, అప్పటి వరకూ లేని పత్రాలు ఇప్పుడు ఎలా వచ్చాయని పద్మనాభం ప్రశ్నించారు. అప్పటి తహశీల్దార్ ఆర్. అప్పలరాజు ఆ భూమి చదును చేసి కాలనీకి సిద్ధం చేయాలని , దానికి అయ్యే ఖర్చు కూడా బిల్లుల రూపంలో చెల్లిస్తామని చెప్పారని అన్నారు. కానీ ఇంత వరకు ఒక్క రూపాయి రాకపోగా తమ స్థలాల కోసం లబ్దిదారులు రూ.40 వేలు చందాలు వేసుకుని ఆర్టిఐ యాక్ట్ ద్వారా చూస్తే సదరు భూమి ప్రభుత్వ భూమిగానే చూపిస్తోందని పద్మనాభం తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వ పెద్దలు స్పందించి తమకు న్యాయం చేయాలని, లేదంటే స్థలాలు కేటాయించే వరకు అదే స్థలంలో దీక్ష చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా దొంగ పత్రాలు సష్టించి అటు ప్రభుత్వానికి, ఇటు లబ్ధిదారులకు మోసం చేస్తున్న ఆ ఇద్దరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దశరధరావు, పి విశ్వనాథం, తులసయ్య, ఇళ్ళ స్థలాల లబ్దిదారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ ప్రతినిధి పద్మనాభం

నేడు 'చలో కలెక్టరేట్'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ఫ్యాప్టో, సిపియస్ఇఎ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపియస్‌కు ప్రత్యా మ్నాయంగా తీసుకొచ్చిన జిపియస్‌ను వ్యతిరేకిస్తూ చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ జనరల్ మజ్జి మదన్మోహన్, కొమ్ము అప్పలరాజు తెలిపారు. సోమవారం చేపట్టనున్న ఛలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఫ్యాప్టో భాగస్వామ్య సంఘాలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపు నిచ్చారు.


నేత్రాలను పరీక్షిస్తున్న డాక్టర్ సుధీర్ కుమార్

125 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- పొందూరు

మండలం మొదలవలస ప్రాథమిక పాఠశాల ఆవరణంలో డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నిర్మూలన సంస్థ శ్రీకాకుళం ఆధ్వర్యంలో డాక్టర్ మొదలవలస సుధీర్ కుమార్ పర్యవేక్షణలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన 125 మందికి కంటి పరీక్షలు చేసి 26 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా అత్యాధునిక పద్ధతిలో లేజర్ ఆపరేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మొదలవలస నీలవేణి, ఎంపీటీసీ మొదలవలస సీతారామారావు, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి శ్రీకాకుళం ఆప్తమాలిక్ ఆఫీసర్ యడ్ల రత్నప్రియ, బెవరా భారతీ, క్యాంప్ ఇంచార్జ్ టి.రామారావు పాల్గొన్నారు.


శతకాలను చదువుతున్న విద్యార్థులు

ప్రాథమిక స్థాయి నుంచి శతకాలు నేర్చుకోవాలి

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుండే వేమన శతకము, భాస్కర శతకము, కష్ణ శతకముతో పాటు వివిధ శతకాలు, అందులో ఉండే పద్యాలు, భావాలు నేర్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పద్యాలు బాగా చదివిన ముగ్గురు విద్యార్థులకు గ్రంథాలయం తరుపున బహుమతులు అందజేశారు. ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమములో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు : బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న బొడ్డు రమేష్‌కు ఆజాద్ సైనిక్ సేవా సమితి ఆర్థిక సాయం అందించింది. అమలపాడు గ్రామానికి చెందిన బొడ్డు రమేష్ గతకొంత కాలంగా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నాడు. బాధితుడు నిరుపేద కుటుంబానికి చెందిన వాడు కావడంతో వైద్య ఖర్చులకు చాలా ఇబ్బంది పడుతు న్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆజాద్ సైనిక్ సేవా సమితి ప్రతినిధులు రూ.25 వేలు శ్రీకాకుళం లోని గ్లోబల్ హాస్పిటల్‌కు వెళ్లి ఆదివారం రమేష్ తండ్రికి అందజేశారు. మానవత్వాన్ని చాటుకున్న సైనికులను కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఆజాద్ సైనిక్ సేవాసమితి సభ్యులు దున్న జోగరావు, పుత్సా భీమరావు, దున్న నారాయణరావు, దున్న శాంతారావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



నరసన్నపేట : స్థానిక పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థిని బెవర హారిక, జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైందని కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గా ప్రసాద్ తెలిపారు. గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న 34 వ సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ విభాగాలలో హారిక ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించిందని తెలిపారు. ఇంతటి ప్రతిభ కనబరిచిన హారికను కళాశాల ప్రిన్సిపాల్ ఇఎం నాయుడు, ఎఐ మెండ మోహన్ దాస్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.


ఎంపికైన క్రీడాకారులు

స్విమ్మింగ్ పోటీలో విజేతలు

ఇచ్ఛాపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్విమ్మింగ్ మండల స్థాయి సెలక్షన్స్ జోనల్ పిడి పద్మనాభ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కోనేరు చెరువులో జరిగాయి. ఇందులో బాలురు 14 మంది, బాలికలు ఐదుగురుని ఎంపిక చేశారు. 26వ తేదీన జరగనున్న జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో పిడి టి.గణేష్, శారద, పి. శ్రీను, రఘు మోహన్, జిల్లా కోచ్ సుభాన్ పిఇటి సంఘ సభ్యులు కృష్ణయ్య పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

నందిగాం: జాతీయ రహదారిపై నందిగామ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. సంతబొమ్మాళికి చెందిన జి.భగవాన్ రోడ్డు పక్కన తన ఆటోను నిలిపి ఉంచగా అదే రహదారి గుండా టెక్కలి వైపు నుంచి పలాస వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొనడంతో ఆటోలో ఉన్న భగవాన్ తలకు తీవ్ర గాయమైంది. 108 సహాయంతో టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న టిడిపి దీక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఆదివారం నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. 12వ రోజు జరిగిన ఈదీక్షలో జిల్లాలోని పార్టీ లీగల్ ఆధ్వర్యాన పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి కక్షసాధింపు చర్యలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అవసరమా, కక్షసాధింపుతో నియంతృత్వపు ఆంక్షలు అవసరమో ప్రజలు ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్‌తో పాటు న్యాయవాదులు పార్థసారధి, పాలిశెట్టి మల్లిబాబు పాల్గొన్నారు.

ఆమదాలవలస చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పొట్నూరు రమేష్ అన్నారు. ఆదివారం పట్టణంలో టిడిపి కార్యాలయం వద్ద నేను సైతం బాబుతోనే రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వైశ్యరాజు రాజేంద్ర, గుడ్ల దుర్గాప్రసాద్, గుడ్ల రాజ్యలక్ష్మి, చింతాడ కష్ణ వాసుదేవరావు, బోర గోవిందరావు, మొదలవలస రమేష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం+ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా ఇచ్ఛాపురం పట్టణంలో గత 12రోజులుగా రిలే నిరాహారదీక్షలు విజయవంతంగా కొనసాగుతోంది..ఆదివారం నాడు కంచిలి మండలానికి చెందిన టిడిపి నేతలు దీక్ష లో కూర్చున్నారు. ఢిల్లీరావు, కె.శంకర్‌రెడ్డి, ఎన్. జానీ, డి.కామేశ్వరరావు, లీలారాణి,పద్మనాభం పాల్గొన్నారు.

లావేరు : మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును అక్రమ అరెస్టు చేసిన క్రమంలో ఆయన ఆరోగ్యం బాగుండాలని కోరుతూ విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం నుండి ఆదివారం దంతులూరి సూర్యనారాయణమూర్తి రాజు అరసవల్లి సూర్యనారాయణమూర్తిని దర్శించుకునేందుకు పాదయాత్ర చేసుకుంటూ వెళ్తున్న సూర్యనారాయణరాజు బందానికి లావేరు మండలం తాళ్లవలస సమీపంలో జాతీయ రహదారిపై రణస్థలం గ్రామ సర్పంచ్ పిన్నింటి భానోజీరావు పాదయాత్రకు స్వాగతం చెపుతూ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబుకి విఘ్నాలు తొలగిఆరోగ్యంతో బయటకు రావాలని ఆకాంక్షించారు. అప్పల స్వామి నాయుడు, రమేష్, మాజీ ఎంపిటిసి దుర్గా, సూర్యారావు, రామి నాయుడు ఉన్నారు.

కోటబొమ్మాళి : స్థానిక టిడిపి కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్ ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తర్ర రామక్రిష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, టెక్కలి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషు, సంతబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, టీడీపీ నాయకులు ఉన్నారు.

పలాస: కాశీబుగ్గలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి. పలాస నియోజకవర్గ పరిధిలో ఉన్న యాదవ సంఘం నాయకులు రిలే దీక్షలో పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడును విడుదల చేసే వరకూ రిలే దీక్షలు కొనసాగుతాయని మాజీ మంత్రి గౌతు శివాజీ, పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రోటరీ సభ్యులు

రోటరీ సేవల్లో ప్రజల భాగస్వామ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు వీలుగా అందరి భాగస్వామ్యాన్ని తీసుకోవాలని రోటరీ డిస్ట్రిక్టు గవర్నర్ రావూరి సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని బృందావనం ఆడిటోరియంలో రోటరీ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యాన రోటరీ పబ్లిక్ ఇమేజ్ ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆయన హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు ప్రజలకు అందించడం ద్వారా రోటరీ క్లబ్ గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. కొత్త రోటరీ సభ్యుల చేరికతో దాతల సహకారం పెంచాలన్నారు. కార్యక్రమంలో పూర్వ గవర్నర్ సిహెచ్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ రోటరీ 1995 నుంచి ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలన కార్యక్రమంలో ప్రభుత్వ సంస్థలతో కలిసి పనిచేస్తోందన్నారు. గవర్నర్ ఎలెక్ట్ డా.మల్లా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళా సాధికారత, మహిళ శిశు సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక ఆర్థిక అభివృద్ధి అంశాలపై రోటరీ సేవలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం రోటరీ క్లబ్ అధ్యక్షులు గీతా శ్రీకాంత్, డాక్టర్ రెడ్డి తిరుపతిరావు, పిడిజి ఎం. రామారావు, పబ్లిక్ ఇమేజ్ కోఆర్డినేటర్ పి.శివన్నారాయణ పాల్గొన్నారు .



అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

పలు చోట్ల అన్నదానం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలో పలుచోట్ల కొలువుదీరిన గణనాథులు ప్రత్యేక పూజలు అందుకుంటున్నారు. ఆదివారం బొజ్జ గణపయ్యలను ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కొన్ని విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ముఖ్యంగా మేజరు పంచాయతీ పరిధిలో విద్యుత్ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సుమారు 3వేలు మందికి ఆదివారం అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు లఖినేని కరుణాకర్, ఎల్. గోవిందరావు, పి. మాధవరావు, సామ సంజీవరావు, మురళి, ఆర్. రంగారావు, అప్పన్నలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే సూర్యరత్న మోడరన్ రైస్‌మిల్లు ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సుమారు 5వేలు మందితో భారీ ఎత్తున అన్నదానాన్ని సకల భక్తుల వైకుంఠ రావు, వారి కుమారుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

రణస్థలం రూరల్ : వినాయక నవరాత్రుల సందర్భంగా లక్ష్మీ నగర్ కాలనీలో ఆదివారం లడ్డు వేలం వేసారు. అందులో జెఆర్ పురంకు చెందిన చుక్కల ధర్మారావు రూ. 20 వేలుకు వేలం పాటలో లడ్డుని దక్కించుకున్నారు. అనంతరం భారీగా అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 1600 మంది అన్న ప్రసాదాలు స్వీకరించారు. కమిటీ సభ్యులు రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట బానోజీ నాయుడు, ఉద్దవల అంజిబాబు, కొప్పిశెట్టి లక్ష్మణరావు పాల్గొన్నారు.

వ్యవస్థల నిర్వహణలో మార్పులు అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



రాష్ట్రంలో గడచిన నాలుగున్నరేళ్ల కాలం పాటు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ తమ సొంత జాగీరు సంస్థల్లా వాడుకుంటూ ప్రత్యర్థుల పట్ల కక్షపూరిత చర్యలకు పాల్పడుతోందని, నిరంకుశంగా వ్యవహరిస్తున్న తీరు ప్రజలకు ఆందోళనకు గురి చేస్తోందని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ పేర్కొన్నారు. అరసవల్లిలో ఆయన నివాసంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వాలు తమ పాలనను సజావుగా సాగించడంలో శ్రద్ధ చూపేందుకు వీలుగా వ్యవస్థల్లో మార్పు అనివార్యమన్నారు. జగన్ ప్రభుత్వానికి చట్టసభలు, పోలీసు, సిఐడి, న్యాయస్థానాలు, రాజ్యాంగ బద్ధంగా ఏర్పడ్డ యంత్రాంగమంటే గౌరవం లేదన్నారు. తప్పు చేయని చంద్రబాబును జైలుకు పంపించి బెయిల్‌పై ఏళ్ల తరబడి బయట ఉన్న ముద్దాయిల పట్ల కేంద్రం, సుప్రీం కోర్టు పునరాలోచన చేయాలన్నారు. నిర్మాణాత్మకంగా మార్పులు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రణస్థలం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1991-1992 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఇప్పటి లావేరు మండల విద్యాశాఖ అధికారి లండ ఈశ్వరరావు, రణస్థలం జూనియర్ కళాశాల లెక్చరర్ బాలి వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆత్మీయంగా కలిశారు. వచ్చే ఏడాది 2024 జనవరి 9 అందరం కలిసి ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానం చేసుకొని స్కూల్ అభివృద్ధి కోసం చర్చించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.

పలాస : పలాసలో 1968 - 78 బ్యాచ్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో కలిసి వారి గత జ్ఞాపకాలను పంచుకున్నారు. అప్పట్లో తనతో కలిసి చదువుకున్న వారిలో చనిపోయిన వారి పేర్లను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వారు అప్పట్లో చదువుకున్న పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి వారి తరగతి గదులను పరిశీలించారు. అప్పటి కళాశాల పరిస్థితి ఇప్పటి మార్పును గుర్తించి సంతోషపడ్డారు.



పలాస : ఆత్మీయ కలయికలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సంపూర్ణ ఆరోగ్య భారత్‌లో ఫార్మాసిస్టులదే ప్రధానపాత్ర

ప్రజాశక్తి- పలాస



బోనెల గోపాల్

డాక్టర్లు రోగులకు ప్రాణం పోస్తే ఆ మందులకు ప్రాణం పోసేది ఫార్మసిస్టులేనని ఫార్మసీ సంఘ నాయకులు బోనెల గోపాల్ అన్నారు. ప్రపంచ ఫార్మసీ డే సందర్భంగా ఫార్మసీ సంఘ నాయకులు బోనేల గోపాల్ మాట్లాడుతూ ప్రపంచ ఫార్మసిస్టులందరూ సమాజంలో తమ వంతు బాధ్యతగా కోవిడ్ లాంటి విపత్తు సమయంలో వ్యాక్సినేషన్, మందులు తయారీ, మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లో పని చేస్తూ సేవలు చేశారన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో డాక్టర్లు జబ్బు పేరు మాత్రమే రాస్తారని మిగతా మందులు వివరాల బాధ్యత మందులు ఇచ్చే సమయంలో డోసేజ్ రోగికి కౌన్సిలింగ్ చేయడం బాధ్యత ఫార్మసిస్టులదే అని అన్నారు. రాబోయే తరాలకు ఫార్మసీ రంగం అభివృద్ధి చెందడానికి మరింత అవకాశం ఉందని, దీనికోసం హెల్త్ సిస్టంలో మరిన్ని ఉన్నతమైన వత్తిగా మార్పుటకు ప్రభుత్వాలు ముందుకు వచ్చి ఈ రంగాన్ని బలోపేతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.